సాక్షి ఒడిశా

7

శుక్రవారం । 22 । సెప్టెంబర్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలక వర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.2,63,551లు, వచ్చాయని అధికారులు తెలిపారు.



స్పీకర్ పదవికి నామినేషన్ దాఖలు

రాష్ట్ర శాసనసభ స్పీకర్ పదవికి బిజూ జనతాదళ్ (బిజేడీ) అభ్యర్థిగా ప్రమీలా మల్లిక్ గురువారం నామినేషన్ దాఖలు చేశారు.

- 8లో▸



కొనసాగుతున్న చవితి ఉత్సవాలు

గణపతి నవరాత్రుల ఉత్సవాలు అన్ని గ్రామాల్లో ఉత్సాహంగా కొనసాగుతున్నాయి.

- 8లో▸

న్యూస్‌రీల్


రాయగడ పర్యటన



గౌరవ వందనాన్ని స్వీకరిస్తున్న జనరల్ సురేష్

రాయగడ: ఎన్‌సీసీ ఒడిశా డిప్యూటీ డైరెక్టర్ జనరల్ జై సురేష్ గురువారం రాయగడలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక మహిళా కళాశాలలోని ఎన్‌సీసీ విద్యార్థులతో సమావేశమయ్యారు. ముందుగా అతనికి ఎన్‌సీసీ క్యాడెట్లు స్వాగతం పలికారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అర్చన పట్నాయక్ పుష్పగుచ్ఛాలను అందించి సాదరంగా ఆహ్వానించారు. క్యాడెట్ల నుంచి గౌరవ వందనం స్వీకరించిన జనరల్ సురేష్ మాట్లాడుతూ దేశ సేవలో మహిళల పాత్ర చాలా కీలకమన్నారు. ఎంతోమంది మహిళలు నిస్వార్థంగా తమ సేవలను జాతికి అంకితం చేస్తున్నారని ప్రశంసించారు. ఎన్‌సీసీలో మహిళలు ఉత్సాహంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గానికి అభినందనలు తెలుపుతున్న రమేష్ చంద్ర సాహు

భువనేశ్వర్: తూర్పు కోస్తా రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ జోనల్ కార్యాలయ శాఖ నూతన కార్యవర్గం ఎన్నిక గురువారం జరిగింది. ఈ ఎన్నికలో అధ్యక్షునిగా సుశాంత కుమార్ సహాని, కార్య నిర్వాహక అధ్యక్షునిగా భగవాన్ పండా, ఉపాధ్యక్షులుగా సుశాంత మహాపాత్రో, తాపస్ మహాపాత్రో, కార్యదర్శిగా సంజయ్ దాస్, సహాయ కార్యదర్శులుగా హేమంత్ మల్లిక్, కిషోర్ నాయక్, పంచులత దాస్, స్నేహలత బస్తియా, కార్యనిర్వాహక కార్యదర్శులుగా శివ ప్రసాద్ నాయక్, కె.సి.మాఝి, కోశాధికారిగా శంభునాథ్ మల్లిక్ ఎన్నిక అయ్యారు. వీరందరికి ప్రధాన కార్యదర్శి రమేష్ చంద్ర సాహు ప్రత్యేకంగా అభినందించి సత్కరించారు.

దోపిడీ కేసులో ఆరుగురు అరెస్టు



అరెస్టైన నిందితులను చూపిస్తున్న పోలీసులు

బరంపురం: రెండు రోజుల క్రితం స్థానిక అన్నపూర్ణ మార్కెట్‌లోని బి.మార్ట్‌లో చోరీకి పాల్పడిన దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. ఎస్డీపీవో అశ్వనీ కుమార్ తెలిపిన వివరాలు మేరకు... ఈనెల 19వ తేదీ అర్ధరాత్రి టౌన్ పోలీసుస్టేషన్ పరిధి అన్నపూర్ణ మార్కెట్‌లో ఉన్న బి.మార్ట్ మహల్‌లో దుండగులు చొరబడి, మహల్‌లో ఉన్నటువంటి సామగ్రి దోచుకెళ్లారు. దీంతో బాధితులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. గురువారం దోపిడీకి పాల్పడిన ఆరుగురు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్డీపీవో తెలియజేశారు. అరెస్టైనవారి దగ్గర నుంచి రెండు బంగారం గొలుసులు, ఒక బంగారం మంగళ సూత్రం, 4 బంగారం గాజులు, 2 బంగారం రింగులతో పాటు దోపిడీకి వినియోగించిన ఒక ఇనుప రాడ్డు, ఒక చాకు, ఒక స్క్రూడ్రైవర్ స్వాధీనం చేసుకున్నారు. అరెస్టైనవారిలో బాబుల్ బహుదూర్, సునీల్ పాఢి, బిపిన్ నాయక్, సూరజ్ పాఢీలు ఉన్నట్లు నిర్ధారించారు. వారిని కోర్టులో హాజరుపరిచి జైలుకి తరలించారు.

బస్సు, కారు ఢీ

- ఆరుగురికి గాయాలు



బస్సు-కారు ఢీకొన్న దృశ్యం

బరంపురం: గంజాం మరియు గజపతి జిల్లాల సరిహద్దు తప్తపాణీ ఘాట్ రోడ్డులో బస్సు-కారు గురువారం ఢీకొన్నాయి. ఈ ఘటనలో డ్రైవర్, క్లీనర్‌తో సహా మరో నలుగురు తీవ్రగాయాలతో ఆస్పత్రి పాలైన ఘటన జిల్లావ్యాప్తంగా సంచలనం రేపింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మరియు పోలీసు అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని క్షతగ్రాతులను ఆస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి... సభా సమరం



- నేటి నుంచి వర్షాకాల సమావేశాలు
- తొలిరోజు స్పీకర్ ఎంపిక
- మొత్తం 13 రోజుల సమావేశాలు

భువనేశ్వర్:

రాష్ట్ర శాసనసభలో వర్షాకాల సమావేశాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాలు అక్టోబర్ 4వ తేదీ వరకు కొనసాగుతాయి. సమావేశాలు తొలి రోజున స్పీకర్ పదవికి ఎన్నిక జరుగుతుంది. అక్టోబర్ 3న అనుబంధ బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈ సెషన్‌లో మొత్తం 13 పని దినాలతో షెడ్యూల్ రూపొందించారు. వర్షాకాల సమావేశాలు వాడివేడిగా సాగే అవకాశం ఉంది. ప్రతిపక్షాలు వివిధ సమస్యలపై ప్రభుత్వాన్ని చుట్టుముట్టేందుకు ప్రయత్నిస్తున్నాయి. మరోవైపు రాష్ట్ర అసెంబ్లీ వర్షాకాల సమావేశానికి ముందు ఉపాధ్యాయుల ఆందోళన ఉధృతం అయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర శాసన సభ లోపల, బయట కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) సునీల్ బన్సల్ ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. ఆయనతో జంట నగరాల పోలీసు కమిషనర్ సౌమేంద్ర కుమార్ ప్రియదర్శి, నగర డీసీపీ ప్రతీక్ సింగ్ పాల్గొన్నారు. వీరంతా కలిసి శాసన సభ లోపల, బయట తాజా స్థితిగతులను గురువారం సమీక్షించారు.

మూడంచెల భద్రత

శాసనసభ కొత్త స్పీకర్ ఎన్నికతో శుక్రవారం నుంచి వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్నాయి. శాసనసభ నలువైపులా మూడంచెల భద్రతా ఏర్పాట్లు చేశారు. సభ లోపల, బయట మరియు మధ్యంతర అంచెల్లో భద్రతా వ్యవస్థ పని చేస్తుందని డీజీపీ వివరించారు. ఒడిశా అసెంబ్లీ వర్షాకాల సమావేశాల సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసు కమిషనరేట్ 30 ప్లాటూన్ల భద్రతా బలగాలను మోహరిస్తుంది. ఈ ఏర్పాట్లు భువనేశ్వర్ డీసీపీ ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తారు.

ట్రాఫిక్ అంతరాయం కలగకుండా...

సమావేశాలు పురస్కరించుకుని శాసన సభ పరిసరాల్లో ట్రాఫిక్ సజావుగా సాగేందుకు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. రాష్ట్ర ఇంటెలిజెన్స్ చీఫ్ మరియు ఇతర సీనియర్ అధికారులతో సంప్రదించి సమగ్ర భద్రతా ఏర్పాట్లను సమీక్షించినట్లు డీజీపీ వివరించారు. ఎలాంటి అవాంతరాలు లేకుండా ఈ విడత సమావేశాలు పూర్తవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. శాసనసభ ప్రవేశ మార్గాల నుంచి మొదలుకొని నలువైపులా లోపల, బయట భద్రతా కార్యకలాపాలు నిర్వహించేందుకు 30 ప్లాటూన్ల బలగాలు, 125 మంది అధికారుల ప్రత్యక్ష పర్యవేక్షణలో పని చేస్తాయని జంట నగరాల పోలీసు కమిషనర్ సౌమేంద్ర కుమార్ ప్రియదర్శి తెలిపారు.



భద్రతా ఏర్పాట్లు సమీక్షిస్తున్న డీజీపీ తదితరులు

ముందస్తుకు ముహూర్తం..?


భువనేశ్వర్: రాష్ట్ర శాసనసభ వర్షాకాల సమావేశాలు పురస్కరించుకుని ముందస్తు జమిలి ఎన్నికల ఊహాగానాలకు తెరపడే అవకాశం ఉంది. ఈ సమావేశాల నిర్వహణ ముందస్తు ఎన్నికలకు సంకేతంగా పలు వర్గాలు భావిస్తున్నాయి. సభలో అనుబంధ బడ్జెటు ప్రవేశపెట్టి ఆమోదం పొందడంతో సమావేశాలకు తెరదించే అవకాశం లేకపోలేదు. వ్యూహాత్మకంగా ఖాళీగా ఉన్న స్పీకర్ పదవి భర్తీ చేసేందుకు సమావేశాల తొలి రోజున ఈ ఎన్నిక ముగిస్తున్నారు. వెంబడి సమావేశాల్ని ప్రారంభించి సానుకూలంగా పరిస్థితులను మలచుకుని సమావేశాలకు తెరదించడంతో పాటు సభ రద్దుకు తీర్మానం ప్రతిపాదించే దిశలో పావులు కదులుతున్నట్లు విపక్ష వర్గాల నుంచి ఊహాగానాలు షికారు చేస్తున్నాయి. ఇదే వాస్తవమైతే ముందస్తు ఎన్నికలకు అధికార పక్షం శంఖారావం చేసినట్లే. ఈ ఏడాది నవంబర్ లేదా డిసెంబర్ నెలలో ముందస్తు అసెంబ్లీ ఎన్నికలు జరిగే అవకాశం ఉన్నట్లు విపక్ష శిబిరాల్లో హడావుడి తారస పడుతోంది.

అక్టోబర్ 14 నుంచి మా కాళువ ఉత్సవాలు



శుభరాట వేస్తున్న దృశ్యం

బరంపురం: స్థానిక గుసానినువాగంలో కొలువైన మా కాళువా ఉత్సవాలు అక్టోబర్ 14వ తేదీ నుంచి అంగరంగ వైభవంగా జరగనున్నాయి. ఈ మేరకు గుసానినువాగంలోని తాత్కాలిక ఆలయ ప్రాంగణంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ ప్రాంగణంలో శుభరాట వేశారు. అక్టోబర్ 14వ తేదీ నుంచి గౌరీ పూర్ణిమ వరకు ఉత్సవాలు జరుగుతాయని నిర్వాహకులు తెలియజేశారు. భక్తులు, సందర్శకులకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని, అమ్మవారి ప్రధాన ఘటం తిరువీధుల్లో అర్ధరాత్రి వరకు ఊరేగించనున్నట్లు పేర్కొన్నారు. ఉత్సవాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కమిటీ ప్రతినిధులు మాజీ మేయర్ శిబశంకర్ దాస్ కోరారు.



మా కాళువ అమ్మవారి ఉత్సవ విగ్రహం

కలలో కనిపించి.. పొలంలో ప్రత్యక్షమై..!

- తవ్వకాల్లో లభించిన వినాయక విగ్రహాలు



మట్టిలో దొరికిన విగ్రహాలు



పూజలు అందుకుంటున్న వినాయకుడు

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి మల్లవారం పంచాయతీ బడాన్‌గూడ గ్రామంలోని ఒక రైతు కలలో వినాయకుడి విగ్రహం కన్పించి, పొలంలో తవ్వితే అదే విగ్రహం లభించిన ఘటన సంచలనం సృష్టించింది. వివరాల్లోకి వెళ్తే.. బడాన్‌గూడ గ్రామంలో నివాసముంటున్న భీమా మిచు అనే రైతుకు మంగళవారం తెల్లవారుజామున కలలో వినాయకుడి విగ్రహం కన్పించి, తన పొలంలో కొలువై ఉన్నానని చెప్పి బయటకు తీయాలని ఆదేశించింది. దీంతో సదరు రైతు విషయాన్ని తన కుటుంబ సభ్యులకు తెలియజేశారు. కొన్ని రోజుల క్రితం కూడా అదే కల వచ్చినట్లు గ్రామస్తులకు చెప్పాడు. దీంతో మంగళవారం ఉదయం గ్రామస్తుల సాయంతో చెరువు పక్కనే ఉన్నటువంటి తన పొలంలో తవ్వి చూశారు. అయితే కలలో కనిపించిన విగ్రహమే అక్కడ లభ్యమవ్వడంతో ఆశ్చర్యపోయాడు. వెంటనే విగ్రహాన్ని బయటకు తీసి, పొలం పక్కన ఉన్నటువంటి చెరువు గట్టుమీద ఉంచి గ్రామస్తులంతా పూజలు చేశారు. విషయం తెలిసిన గ్రామంలోని వృద్ధులు శ్రీరాముడు వనవాసం చేసిన సమయంలో ఇక్కడ విగ్రహాలను పెట్టి పూజించేవారని చెబుతున్నారు. అప్పటిలో శ్రీరాముడు ఇక్కడ చిన్న గొయ్యిని తవ్వి స్నానమాచరించాడని, అందుకే ఆ చెరువును రామ చెరువు అంటారని పేర్కొన్నారు. పురావస్తు శాఖ అధికారులు బుధవారం గ్రామంలో దొరికిన విగ్రహాలను పరిశీలించారు. అధికారులతో భీమా మాట్లాడుతూ.. మరికొంత దూరంలో శివుడు, పార్వతీ, లక్ష్మీదేవి విగ్రహాలు ఉన్నట్లు తన కలలో కన్పించినట్లు చెప్పాడు. దీని ప్రకారం తవ్వగా మరికొన్ని చోట్ల శ్రీరాముని పాదముద్రలు దొరికాయి. అయితే విగ్రహాలకు గుడికట్టి పూజ చేస్తామని గ్రామస్తులు అధికారులకు కోరారు. విగ్రహాల పరిశీలనకు భువనేశ్వర్ పంపిస్తామని అధికారులు తెలియజేశారు.

సైకిల్‌పై పుణ్యక్షేత్రాలకు యాత్ర

జయపురం:

పుణ్యక్షేత్రాలైన చార్‌దామ్, గంగోత్రి, యమునాత్రి, కేదార్‌నాథ్, భద్రీనాథ్ మొదలగు పుణ్యక్షేత్రాలకు బొయిపరిగుడ గ్రామం నుంచి ఇద్దరు యువకులు సైకిల్ యాత్రతో గురువారం బయల్దేరారు. వారిరువులు అన్నదమ్ములు కావడం విశేషం. వారు బొయిపరిగుడకు చెందిన కవిరాజ్ పోలమ్ ఇద్దరు కుమారులు అశోక్ పోలమ్, గౌతమ్ పోలమ్‌లు. బొయిపరిగుడ నుంచి దాదాపు 2,200 కిలోమీటర్ల దూరం తాము సైకిళ్లపై 30 నుంచి 35 దినాల్లో పూర్తిచేసే లక్ష్యంతో సైకిల్ యాత్ర చేస్తున్నామని వెల్లడించారు. చిన్నతనం నుంచి చార్‌దామ్ వెళ్లాలన్న కోరిక తమకు ఉండేదని, అందువలన సైకిళ్లపై బయల్దేరినట్లు వెల్లడించారు. వారి పయనం విజయవంతం కావాలని బొయిపరిగుడ ప్రజలు ఆశీర్వదించారు.



సైకిల్‌పై యాత్రకు బయల్దేరిన అన్నదమ్ములు

త్వరలో రైల్‌కోచ్ రెస్టారెంట్ సేవలు



సిద్ధమవుతున్న రైల్ రెస్టారెంట్ కోచ్

రాయగడ: తూర్పుకోస్తా రైల్వే డివిజన్ పరిధి రాయగడ రైల్వేస్టేషన్ ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్న రైల్‌కోచ్ రెస్టారెంట్ సేవలు త్వరలో ప్రారంభం కానున్నాయి. అన్ని హంగులతో రూపుదిద్దుకుంటున్న ఈ కోచ్ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. మరో మూడు వారాల్లోగా దీని సేవలను స్థానికులు పొందే అవకాశం ఉంది. ప్రయాణికుల సౌకర్యార్థం దీనిని ఏర్పాటు చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలియజేశారు. ఒడిశాలో ప్రప్రథమంగా ఈ సేవలు రాయగడలో ప్రారంభం కానుండడం విశేషం. రైల్‌కోచ్ రెస్టారెంట్‌కు సంబంధించిన ప్రత్యేక కోచ్ ముస్తాబు దాదాపు పూర్తయ్యింది. కోచ్ బయట డొంగిరియా సాంప్రదాయ కళాఖండాలను చిత్రీకరించడం విశేషంగా ఆకర్షిస్తుంది. నిత్యం 24 గంటలు సేవలను అందించే ఈ రెస్టారెంటులో ప్రయాణికులతో పాటు అందరికీ సరసమైన ధరల్లో విక్రయాలు ఉంటాయని అధికార వర్గాలు తెలియజేశాయి. అదేవిధంగా అల్పాహారం, భోజన సౌకర్యాలు కూడా ఇందులో లభిస్తాయి, అలాగే విందులు, వినోదాలకు సంబంధించి ఈ రెస్టారెంటు అద్దెకు కూడా లభిస్తుందని రైల్వే వర్గాల భోగట్టా. అమృత్ భారత్ కింద ఎంపికైన రాయగడ రైల్వేస్టేషన్‌లో ఇప్పటికే పలు అభివృద్ధి కార్యక్రమాలు స్టేషన్ ఆధునీకరణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. రైల్‌కోచ్ లోపలి భాగం అత్యంత సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఫర్నీచర్ అమరిక, విద్యుదీకరణ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. ముందుభాగంలో ఉద్యానవనంలా అభివృద్ధి చేస్తుండటంతో పరిసరాలు పచ్చదనాన్ని సంతరించుకుంటున్నాయి.



కోచ్ లోపలి భాగం

భళా.. హస్తకళ

మల్కన్‌గిరి జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే ఆదిత్యా మాడీ చేతులమీదుగా ఉత్కళిక కార్పొరేట్ సంస్థ ద్వారా జైన్ భవనంలో హస్తకళ ప్రదర్శన గురువారం ప్రారంభించారు. సంబల్‌పూర్ చీరలు, షర్ట్‌లు, పూరి శంకోలు, కటక్ పంచలోహ విగ్రహలు, పిపిలి చంది ఆర్ట్ తదితర సుందరమైన సామగ్రి రాష్ట్ర నలుమూలలు నుంచి వచ్చిన కళాకారులు ప్రదర్శించారు. వాటిని చూసేందుకు జిల్లా వాసులు తరలి వస్తున్నారు. హస్త కళలను ప్రభుత్వం ప్రోత్సహించడం అభినందనీయమని పలువురు ఆనందం వ్యక్తం చేశారు.

– మల్కన్‌గిరి



సంబల్‌పూర్ చీరలు



పంచలోహ విగ్రహలు



కర్ర బొమ్మలు



పిపిలీ చంది ఆర్ట్



ప్రదర్శనలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆదిత్యా మాడీ

క్లుప్తంగా

సుదాం మరాండికి అదనపు బాధ్యతలు



సుదాం మరాండి

భువనేశ్వర్: స్పీకర్ అభ్యర్థిగా నామినేషన్ వేయడంతో బిజూ జనతా దళ్ (బీజేడీ) సీనియర్ ఎమ్మెల్యే ప్రమీలా మల్లిక్ తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. ఈ పరిస్థితుల్లో ఆమె నిర్వహించిన రెవెన్యూ – విపత్తు నిర్వహణ విభాగం బాధ్యతలను పాఠశాలలు మరియు సామూహిక విద్యా శాఖ మంత్రిగా కొనసాగుతున్న సుదామ్ మరాండీకి అదనంగా కేటాయించారు. ఇంతకుముందు కూడా ఆయన ఈ శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. అనంతరం ఒడిశా శాసనసభ స్పీకర్ అభ్యర్థిగా ఎన్నిక కోసం నామినేషన్ దాఖలు చేశారు.

మయూర్‌భంజ్ రాజకీయాల్లో దిట్ట

మయూర్‌భంజ్ జిల్లా రాజకీయాల్లో సుదాం మరాండీ బలమైన నాయకుడుగా పేరొందారు. జార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం)తో తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. వరుసగా 2సార్లు రాష్ట్ర శాసన సభకు మరియు ఒకసారి లోక్‌సభకు జేఎంఎం అభ్యర్థిగా ఎన్నికయ్యారు. తదుపరి బిజూ జనతా దళ్ (బీజేడీ)లో చేరారు. 2014 మరియు 2019 సంవత్సరాల్లో జరిగిన ఎన్నికల్లో బంగ్రిపోషి నుంచి 2 సార్లు బిజూ జనతా దళ్ అభ్యర్థిగా పోటీ చేసి శాసన సభకు ఎన్నికయ్యారు. 2014 నుండి 2017 సంవత్సరం వరకు వివిధ శాఖలలో నవీన్ పట్నాయక్ మంత్రివర్గంలో మంత్రిగా కొనసాగారు. 2019 సంవత్సరంలో మరాండీకి క్యాబినెట్ మంత్రి పదవి లభించింది. ఈ సందర్భంగా రెవెన్యూ మరియు విపత్తు నిర్వహణ శాఖను విజయవంతంగా నిర్వహించారు. గతేడాది మరాండీని క్యాబినెట్ నుంచి తొలగించారు. కానీ ఒక సంవత్సరం తర్వాత ఆయనకు పాఠశాలలు మరియు సామూహిక విద్యా విభాగం క్యాబినెట్ మంత్రిగా నవీన్ కొలువులో స్థానం సాధించుకోవడం విశేషం. రానున్న ఎన్నికల్లో మరాండీ రాజకీయ చతురతకు పదును పెట్టేందుకు బీజేడీ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్ ఆచితూచి అడుగు వేసే వ్యవహారంలో సుదాం మరాండీకి పట్టం గడుతున్న విషయం సుస్పష్టం.

బీజేడీ ఎమ్మెల్యేలపై బహిష్కరణ వేటు

భువనేశ్వర్: ప్రజా వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారన్న ఆరోపణ కింద ఖండపడా నియోజకవర్గం ఎమ్మెల్యే సౌమ్య రంజన్ పట్నాయక్, రెముణా నియోజకవర్గం ఎమ్మెల్యే సుధాంశు శేఖర్ పరిడాలను బిజూ జనతా దళ్ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ పార్టీ నుంచి బహిష్కరించారు. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. బీజేడీ ఉపాధ్యక్ష పదవి నుంచి సౌమ్య రంజన్ పట్నాయక్‌ను తొలగించిన దాదాపు వారం తర్వాత ఈ ఉత్తర్వులు జారీ కావడం విశేషం. మరోవైపు షెడ్యూల్డ్ కులాలు మరియు షెడ్యూల్డ్ తెగల లబ్ధిదారుల వ్యవసాయ పరికరాల కొనుగోలుకు సబ్సిడీ మంజూరు ముసుగులో సుధాంశు శేఖర్ పరిడా కోట్లాది రూపాయలను స్వాహా చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. బాలాసోర్ నిగమానంద అసోసియేట్స్ సంస్థ మేనేజింగ్ పార్టనర్‌గా ఉన్న రోజుల్లో రైతుల కోసం ఉద్దేశించిన రూ.3 కోట్లను 2017-18 నుంచి 2019-20 మధ్య కాలంలో దుర్వినియోగం చేసినట్లు ఆరోపణ. ఈ ఆరోపణలపై లోకాయుక్త జారీ చేసిన ఆదేశాల మేరకు రాష్ట్ర విజిలెన్స్ విచారణ చేపట్టింది. అదేవిధంగా ఖండపడా ఎమ్మెల్యే సౌమ్య రంజన్ పట్నాయక్‌కు సంబంధించిన సంబాద్ వార్తాపత్రిక మాజీ ఉద్యోగి చేసిన ఆరోపణలపై అతనితో పాటు ఇతరులపై ఐపీసీ 506/467/468/471/420/120-బి సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. ఆర్థిక నేరాల శాఖ (ఈఓడబ్ల్యూ) చేపట్టిన దర్యాప్తు కొనసాగుతోంది. మోసపూరిత మార్గాలు మరియు నకిలీ పత్రాలను ఉపయోగించి 300 మందికి పైగా సంబాద్ ఉద్యోగుల పేరుతో కోట్ల రూపాయల రుణం తీసుకున్న వ్యవస్థీకృత బ్యాంకు మోసం తీవ్రమైన నేరంగా పరిగణించి చర్యలు చేపట్టినట్లు నవీన్ పట్నాయక్ సంతకంతో జారీ అయిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ప్రశాంతంగా నిమజ్జనాలు చేసుకోవాలి



మాట్లాడుతున్న ఐఐసీ గోవింద గౌడో

పర్లాకిమిడి: ఎటువంటి గొడవలు లేకుండా ప్రశాంత వాతావరణంలో నిమజ్జనాలు చేసుకోవాలని ఎస్పీ స్వాతి ఎస్.కుమార్ సూచించారు. ఈ మేరకు కాశీనగర్ పోలీసుస్టేషన్‌లో శాంతి కమిటీని గురువారం ఏర్పాటు చేశారు. ఈ శాంతి కమిటీ సమావేశంలో పలు గణపతి ఉత్సవాల పూజా కమిటీలను స్టేషన్‌కు పిలిపించి చర్చలు జరిపారు. గతేడాది మాదిరిగా అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకూడదని పోలీసు అధికారి గోవింద గౌడో హెచ్చరించారు. కాశీనగర్‌లో పూజా కమిటీలు నిమజ్జనోత్సవంకు ముందస్తు పర్మిషన్ తీసుకోవాలని స్పష్టం చేశారు. సమావేశంలో కాశీనగర్ గణేష్ ఉత్సవాల కమిటీ సభ్యులతో పాటు ఎస్‌ఐ మమతా పండా, ప్రియవ్రతా స్వయిని, ఏఎస్‌ఐ మనోజ్‌కుమార్ పాడి, కె.వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న చవితి ఉత్సవాలు



జయపురం: సోంబారు తోటలో...




బరంపురం: లక్ష్మీ నరసింహ నగర్‌లో...

గణపతి నవరాత్రులు అన్ని గ్రామాల్లో ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. గురువారం భక్తులు మండపాలకు వెళ్లి బొజ్జ గణపయ్యకు ప్రత్యేక పూజలు చేశారు. తీర్థప్రసాదాలు స్వీకరించి తరించిపోయారు. సాంస్కృతిక కార్యక్రమాలు జోరందుకున్నాయి. కాగా కొన్ని గ్రామాల్లో గణపతి విగ్రహాల నిమజ్జనాలు సైతం జరిగాయి. యువకులు భారీ విగ్రహాలను వాహనాలపై తరలిస్తూ సందడి చేశారు. మరికొన్నిచోట్ల లడ్డూ వేలంపాట నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



భువనేశ్వర్: పూజలందుకుంటున్న వైభవ గణపతి



జయపురం: భోయీవీధిలో...



రాయగడ: నిమజ్జనం చేస్తున్న బ్రాహ్మణ సేవా సమాజం సభ్యులు



జయపురం: హంస వాహనంపై విఘ్నేశ్వరుడు



జయపురం: పాణినాల వీధిలో ఈశ్వరుని ఒడిలో వినాయకుడు కొలువుదీరిన దృశ్యం



బరంపురం: మిలటరీ లైన్‌లో...



బరంపురం: హౌసింగ్ బోర్డు కాలనీలో...



బరంపురం: అంకులి గ్రామంలో...



బరంపురం: అస్కా రోడ్‌లో...



జయపురం: ఎన్‌కేటీ రోడ్డులో...



బరంపురం: దిగపండిలో...

‘అహింసతోనే స్వాతంత్య్రం’



పర్లాకిమిడి: ర్యాలీలో బాయ్ స్కౌట్స్ విద్యార్థులు



పర్లాకిమిడి: పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



బరంపురం: అహింస రథం ప్రారంభిస్తున్న ఎంపీ శేఖర్ సాహు తదితరులు

బరంపురం: అహింసతోనే మన దేశానికి స్వాతంత్య్రం వచ్చిందని బరంపురం ఎంపీ చంద్రశేఖర్ సాహు అన్నారు. ప్రపంచ శాంతి దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక సర్కిల్ జైల్ ప్రాంగణంలో అహింసా రథాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అక్టోబర్ 2వ తేదీన గాంధీ జయంతిని పురస్కరించుకొని, ప్రజలను చైతన్యపరిచేందుకు రథం ప్రారంభించడం జరిగిందని తెలియజేశారు. ప్రజలంతా గాంధీ మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బరంపురం మేయర్ సంఘమిత్ర దొళాయి, ఎమ్మెల్యే విక్రమ్ పండా, బరంపురం సర్కిల్ జైల్ జైలర్ మరియు సూపరింటెండెంట్ తదితరులు పాల్గొన్నారు.

పర్లాకిమిడి: అంతర్జాతీయ శాంతి దినోత్సవాన్ని పురస్కరించుకొని పర్లాకిమిడి మహారాజా బాలుర ఉన్నత పాఠశాల నుంచి మహేంద్రగిరి ఉన్నత పాఠశాల వరకు పట్టణంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో మహేంద్రగిరి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పూర్ణచంద్ర ప్రధాన, ఎం.ఆర్.బాయ్స్ హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్‌ఎం వై.ధర్మారావు, పరమేశ్వర్ నాయక్, కె.వాసుదేవ్‌రావు, కె.వి.రెడ్డి, సుదీప్త కుమార్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక రాజవీధి ప్రైవేటు కల్యాణ మండపంలో అంతర్జాతీయ శాంతి దినోత్సవం నిర్వహించారు. శాంతి కోసం కలిసికట్టుగా పోరాడాలని స్వాద్ పీస్ నెట్‌వర్క్ బిమల్ చంద్ర నాయక్ కోరారు. సమావేశానికి జిల్లాలో నలుమూలల నుంచి క్రిస్టియన్ సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు.



బరంపురం: శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

స్పీకర్ పదవికి నామినేషన్ దాఖలు



నామినేషన్ దాఖలు చేస్తున్న ప్రమీలా మల్లిక్

- తొలి మహిళా స్పీకర్‌గా ఎన్నికవ్వనున్న ప్రమీలా

భువనేశ్వర్: రాష్ట్ర శాసనసభ స్పీకర్ పదవికి బిజూ జనతాదళ్ (బీజేడీ) అభ్యర్థిత్వాన్ని ప్రకటించిన ఒకరోజు తర్వాత, ప్రమీలా మల్లిక్ గురువారం రెవెన్యూ మరియు విపత్తు నిర్వహణ శాఖ మంత్రి పదవికి రాజీనామా చేశారు. పలువురు మంత్రులు మరియు బీజేడీ ఎమ్మెల్యేలతో కలిసి తన నామినేషన్ దస్తావేజులను అసెంబ్లీ కార్యదర్శికి దాఖలు చేశారు. ఈ ఎన్నిక ఈనెల 22న శుక్రవారం ఉదయం 9.30 గంటలకు జరుగుతుంది. వెంబడి శాసన సభలో వర్షాకాలం సమావేశాలు ప్రారంభం అవుతాయి. ఈ నేపథ్యంలో ఎన్నికైన కొన్ని క్షణాల్లో ప్రమీలా మల్లిక్ రాజ్యాంగబద్ధమైన ప్రతిష్టాత్మక స్పీకరు సింహాసనం అధిష్టిస్తారు. అధ్యక్షా సంబోధనతో గౌరవప్రదమైన సహా మర్యాదలను పొందుతారు. ఈ అరుదైన అవకాశం తొలి మహిళగా ప్రమీలా మల్లిక్‌కు వరించడం విశేషం.

ఎన్నిక ఏకగ్రీవం

ప్రమీలా మల్లిక్ ఏకగ్రీవంగా రాష్ట్ర శాసనసభ స్పీకర్‌గా ఎన్నిక అవుతారు. భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అభ్యర్థిని బరిలోకి దింపేది లేదని ప్రకటించింది. సభలో కాంగ్రెస్‌కు సంఖ్యాబలం లేదు. ఈ పరిస్థితుల్లో ప్రమీలా మల్లిక్ ఎన్నికకు తిరుగు లేదనేది సుస్పష్టం. 147 మంది ఎమ్మెల్యేలు ఉన్న సభలో బీజేడీకి 113 మంది సభ్యులు ఉండగా, బీజేపీ బలం 22, కాంగ్రెస్‌కు నామమాత్రంగా 9 మంది సభ్యుల బలంతో ఊగిసలాడుతుంది. ఈ ఏడాది మే 12న నవీన్ పట్నాయక్ కొలువు పునర్వ్యవస్థీకరణ పురస్కరించుకుని విక్రమ్ కేశరి అరూఖ్ స్పీకర్ పదవికి రాజీనామా చేశారు. అనంతరం ఆయనకు ఆర్థిక శాఖ మంత్రిగా నియమించడంతో శాసన సభలో స్పీకర్ స్థానం ఖాళీ అయింది. ఈ స్థానం భర్తీ చేసేందుకు మధ్యంతర ఎన్నిక నిర్వహణ అనివార్యమైంది. అధికార పక్షం ప్రమీలా మల్లిక్‌కు స్పీకర్‌గా పోటీ చేసేందుకు బరిలోకి దింపింది. ఆమె జాజ్‌పూర్ జిల్లా భింజర్‌పూర్ నుంచి వరుసగా 6 సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై శాసన సభలో ప్రాతినిథ్యం వహిస్తున్నారు. 1990లో భింజార్‌పూర్ నుంచి జనతా దళ్ (జేడీ) అభ్యర్థిగా పోటీచేసి విజేతగా నిలిచి ఎమ్మెల్యేగా తొలిసారి శాసనసభలో అడుగు పెట్టారు. ఆమె 2000 నుంచి ఈ నియోజకవర్గం నుంచి గెలుపొందుతున్నారు. 2004 నుంచి 2011 వరకు మహిళా మరియు శిశు అభివృద్ధి శాఖ మంత్రిగా కొనసాగారు. ప్రభుత్వ చీఫ్ విప్‌గా 3 సంవత్సరాల పాటు కీలకమైన బాధ్యతలు నిర్వహించారు. 2019 సంవత్సరం మే 30 నుంచి 2022 సంవత్సరం జూన్ 6 వరకు చీఫ్ విప్‌గా కొనసాగారు.

పారిశుద్ధ్యం పేరుతో అవకతవకలు



ఆందోళనకారులతో చర్చలు జరుపుతున్న చైర్మన్ శంకరరావు

- కౌన్సిల్ హాల్ వద్ద ప్రజల నిరసన

జయపురం: జయపురం సబ్ డివిజన్ కోట్‌పాడ్ నోటిఫైడ్ ఏరియా కౌన్సిల్(ఎన్‌ఏసీ)లో పారిశుద్ధ్య పనుల్లో అవకతవకలు చోటు చేసుకుంటున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు అనేక మంది ప్రజలు కౌన్సిల్ హాల్ ఎదుట గురువారం బైఠాయించారు. ఎన్‌ఏసీలోని 13 వార్డుల్లో పారిశుద్ధ్య పనులు నిర్వహించేందుకు టెండర్లలోను, శానిటేషన్ పనుల్లో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపించారు. పారిశుద్ధ్య పనులకు సంబంధించి కంట్రాక్టర్లకు ప్రతినెలా రూ.లక్షలు చెల్లిస్తున్నా సక్రమంగా పరిశుభ్రం చేయడం లేదన్నారు. బ్యాటరీలతో నడుస్తున్న బండ్లు మూలన పడివున్నా, ప్రజల నుంచి నెలవారీ డబ్బులు వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎన్‌ఏసీ కార్యాలయంలో మరుగుదొడ్డి బాగా పనిచేస్తోందని, అయితే పట్టణంలో మరుగుదొడ్లపై అధికారులు దృష్టి పెట్టకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. దైనిక బజారులో ప్రాంతంలోని కల్యాణ మండపంలో స్టాల్స్ నిర్మించడాన్ని నిరసిస్తూ న్యాయవాది కిశోర్ చంద్ర మిశ్ర ధ్వజమెత్తారు. దీంతో ఎన్‌ఏసీ చైర్మన్ ఎం.శంకరరావు ఆందోళనకారులతో చర్చించి ఆరోపణలపై తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేపట్టాలని కార్యనిర్వాహక అధికారి రాజేంద్ర ఖొర, శానిటరీ సూపర్‌వైజర్లను ఆదేశించారు. దీంతో ఆందోళనకారులు నిరసన విరమించారు. కార్యక్రమంలో మిను రౌత్, ప్రశాంత మహంతి, విద్యావదర హత్త, ఎన్‌ఏసీ మాజీ వైస్ చైర్మన్ బపూన్ త్రిపాఠీ తదితరులు పాల్గొన్నారు.



కోట్‌పాడ్ ఎన్‌ఏసీ కార్యాలయం

టెక్కలి పోలీస్ స్టేషన్ వెనుక వరుసగా చోరీలు



బంగారు గొలుసు చోరీ జరిగిన సెల్ఫ్‌ను చూపుతున్న బాధితురాలు

టెక్కలి: టెక్కలి పోలీస్‌స్టేషన్‌కు వెనుక ఉన్న ఎన్‌టీఆర్ కాలనీలో వరుసగా దొంగతనాలు జరుగుతుండడంతో కాలనీ వాసులు భయాందోళన చెందుతు న్నారు. కాలనీలో గల 5వ లైన్ వీధిలో నివాసం ఉంటున్న జానకి వనజాక్షి ఇంటిలోకి బుధవారం అర్ధరాత్రి దొంగలు ప్రవేశించి మెయిన్‌గేట్ తాళాలు, పక్క గేట్ తాళాలతో పాటు ఇంటి తలుపులు తెరచి మెయిన్‌హాల్ సెల్ఫ్‌లో ఉన్న రెండు తులాల బంగారు గొలుసును దొంగిలించారు. గురువారం ఉద యం లేచి చూసే సరికి ఇంట్లో దొంగతనం జరిగినట్లు గుర్తించారు. ఇంట్లో మొత్తం సామాన్లు చిందరవందరగా పడి ఉండడంతో భయాందోళనకు గురయ్యారు. సామాన్లు చూసుకోగా మెయిన్‌హాల్ సెల్ఫ్ లో భద్రపరచిన రెండు తులాల బంగారు గొలుసు దొంగతనానికి గురైనట్లు గుర్తించారు. దీంతో టెక్కలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దొంగలు ఇంటి తాళాలు సైతం ఎత్తుకుపోవడం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. మూడు రోజుల కిందట ఇదే ఇంటిలో పట్టపగలే దొంగలు చొరబడి ఖరీదైన సెల్‌ఫోన్‌ను ఎత్తుకుపోయారు. పోలీస్‌స్టేషన్‌కు వెనుక ఉన్న వీధిలో వరుసగా దొంగతనాలు జరుగుతుండడంతో కాలనీవాసులంతా భయాందోళన చెందుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలు

టెక్కలి రూరల్: మండలంలోని బొప్పాయిపురం గ్రామ జాతీయ రహదారిపై గురువారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అనకాపల్లి నుంచి ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్ వైపు ఖాళీ మద్యం సీసాల లోడుతో వెళ్తున్న ఒక కంటైనర్ లారీ టెక్కలి సమీపంలోకి వచ్చే సరికి లారీ డ్రైవర్ ఎస్.గణేష్ నిద్రమత్తులో అదుపు తప్పి బొప్పా యిపురం సమీపంలో వంతెనను ఢీకొట్టాడు. అయితే అదేమార్గంలో సిమ్మెంట్ లోడ్‌తో విశాఖపట్నం నుంచి సోంపేట వైపు వెళ్తున్న మరో లారీ ఈ కంటైనర్‌ను ఢీకొట్టింది. ప్రమాదం జరిగిన వెంటనే సమాచారం అందుకున్న హైవే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి టెక్కలి పోలీసులకు సమాచారం అందించారు. ప్రమాదంలో కంటైనర్‌ను ఢీకొట్టిన లారీ డ్రైవర్ పి.రవికి కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. కంటైనర్ డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. క్షతగాత్రుడిని టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అనంతరం ఘటనా స్థలానికి చేరుకున్న టెక్కలి పోలీసులు క్రేన్ సాయంతో రహదారిపై ఉన్న లారీలను పక్కకు తొలగించారు. అనంతరం వివరాలు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టెక్కలి ఎస్‌ఐ ఎల్.రామకృష్ణ తెలిపారు.

బాస్కెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

శ్రీకాకుళం న్యూకాలనీ: క్రీడాకారులకు గెలుపోటముల కంటే, క్రీడాస్ఫూర్తిని కనబర్చి, క్రమశిక్షణతో మెలగడం ముఖ్యమని శ్రీకాకుళం జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ చైర్మన్ ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి తెలిపారు. జిల్లా సీనియర్స్ పురుషులు, మహిళల బాస్కెట్‌బాల్ బాల్ జట్ల ఎంపిక పోటీలు గురువారం శ్రీకాకుళం ఎన్టీఆర్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ మైదానం వేదికగా జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరై ఎంపికలను ప్రారంభిన ఎమ్మెస్సార్ మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లా క్రీడల ఖిల్లాగా పేరుగాంచిన విషయాన్ని క్రీడాకారులకు వివరించారు. జిల్లాలో బాస్కెట్‌బాల్‌కు పూర్వ వైభవాన్ని తీసుకువచ్చేందుకు సమష్టిగా ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తున్నామని అన్నారు.

29 నుంచి మార్టేరులో రాష్ట్ర స్థాయి పోటీలు..

ఏపీ రాష్ట్ర స్థాయి సీనియర్స్ పురుషులు, మహిళల బాస్కెట్‌బాల్ చాంపియన్ షిప్ పోటీలు మార్టేరు వేదికగా ఈనెల 29 నుంచి జరగనున్నాయని ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి పేర్కొన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే శ్రీకాకుళం జిల్లా జట్ల ఎంపికలను ఇక్కడ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఎంపికైన జిల్లా ప్రాబబుల్స్ క్రీడాకారులకు శిక్షణ శిబిరాలను నిర్వహించి త్వరలో జాబితాను వెల్లడిస్తామన్నారు. కార్యక్రమంలో డీఎస్‌ఏ బాస్కెట్‌బాల్ కోచ్ జి.అర్జున్‌రావురెడ్డి, జీఎంఆర్ కాలేజ్ నుంచి స్వాతి, బాస్కెట్‌బాల్ సంఘ ప్రతినిధులు రాజు, హమీద్, లవకుమార్, ప్రవీణ్, యు.రవి, కొర్లయ్య, మురళి, సీనియర్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం ఫోర్ట్: వైద్యారోగ్యశాఖ పరిధిలోని లంకాపట్నం యూపీహెచ్‌సీలో ల్యాబ్ టెక్నీషియన్ పోస్టు-1, ఎస్ఎన్‌సీయూలో సపోర్టింగ్ స్టాఫ్ పోస్టు-1 ఖాళీలు ఉన్నాయని అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్. భాస్కర రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుకు ఈడబ్ల్యూఎస్ మహిళ, సపోర్టింగ్ స్టాఫ్ పోస్టుకు ఓసీ-మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేశారు. ఈనెల 26 వతేదీ సాయంత్రం 5 గంటల లోగా దరఖాస్తులను జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. విద్యార్హతలు, వయస్సుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాల కాపీలపై గెజిటెడ్ ఆఫీసర్‌తో సంతకం చేయించాలని పేర్కొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అనూరాధ

పార్వతీపురంటౌన్: కొమరాడ మండలంలోని రావికోన గ్రామంలో బుధవారం రాత్రి ఓ మహిళ పురుగు మందు తాగి ఆత్మహత్యాయాన్నినికి పాల్పడింది. ఈ సంఘటనపై జిల్లా ఆస్పత్రి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన తోయక అనూరాధ గృహిణి. ఆమె భర్త త్రినాథ వ్యవసాయ కూలీ. బుధవారం రాత్రి త్రినాథ పని చేసుకుని ఇంటికి వచ్చేసరికి భార్య పడిపోయి ఉండడం గమనించి స్థానిక పీహెచ్‌సీకి తరలించగా వైద్యులు పరీక్షించి పురుగు మందు తాగిందని తెలిపారు. పరిస్థితి విషమించడంతో పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతోంది. అస్పత్రి అవుట్‌పోస్ట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తూనికలు, కొలతల శాఖ తనిఖీలు


ఎలక్ట్రానిక్ వేయింగ్ మెషీన్‌లు సరిచూస్తున్న ఇన్‌స్పెక్టర్ ఎ.బలరామకృష్ణ

సంతకవిటి: మండల కేంద్రంలోని వినాయక రైస్‌మిల్‌లో తూనికలు కొలతల శాఖ గురువారం క్యాంప్ నిర్వహించి వ్యాపారస్తుల ఎలక్ట్రానిక్ వేయింగ్ మెషీన్‌లు సరిచూసి ముద్రలు వేసింది. ఈ సందర్భంగా ఆ శాఖ బొబ్బిలి ఇన్‌స్పెక్టర్ ఎ.బలరామకృష్ణ మాట్లాడుతూ ప్రతి వ్యాపారస్తుడు సంవత్సరానికి ఒకసారి వేయింగ్ మెషీన్‌లపై ముద్రలు వేయించుకోవాలని, ఎవరైనా వ్యాపారస్తులు ముద్రలు లేకుండా ఎలక్ట్రానిక్ వేయింగ్ మెషీన్‌లు ఉపయోగిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో తూనికలు కొలతలు శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసులమంటూ దౌర్జన్యం

సాలూరు: మండలంలోని కొదమ పంచాయతీ కోడంగివలస గ్రామంలో గుర్తు తెలియని కొందరు దుండగులు పోలీసులమంటూ దౌర్జన్యానికి పాల్పడి, గిరిజనుల ఇళ్లలో చొరబడి బంగారం, నగదు ఎత్తుకెళ్లారు. బుధవారం జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. కోడంగివలస గ్రామంలో రాత్రి తొమ్మిది గంటల సమయంలో నలుగురు వ్యక్తులు ముసుగులు వేసుకుని చొరబడి, తాము పోలీసులమంటూ తెలుగు, హిందీ, ఒడియా భాషల్లో మాట్లాడుతూ మగవారిపై కర్రలతో దాడిచేసి భయానక వాతావరణం సృష్టించారు. అనంతరం చోడిపిల్లి సుకిల దగ్గర రూ.20వేల నగదుతో పాటు సుమారు రూ.లక్ష విలువైన 18 గ్రాముల పుస్తెలతాడు, చోడిపిల్లి బొందురు నుంచి రూ. 20వేల నగదుతో పాటు సుమారు రూ.35వేలు విలువ చేసే ఆరు గ్రాముల బంగారం, చోడిపిల్లి చిన్నమ్మి నుంచి పుస్తెలతాడుతో పాటు రూ.20వేల నగదు ఎత్తుకెళ్లారు. దీనిపై బాధితులు గురువారం సాయంత్రం సాలూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రయోగమూర్తి తెలిపారు.

మాస్టర్ అథ్లెట్‌కు ఎస్పీ అభినందన


సన్యాసినాయుడును అభినందిస్తున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: అంతర్జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీల్లో పోల్‌వాల్ట్ విభాగంలో రజతపతకం సాధించిన ఏఆర్ కానిస్టేబుల్ పి.సన్యాసినాయుడును ఎస్పీ ఎం.దీపిక తన కార్యాలయంలో గురువారం అభినందించారు. గతనెల 19 నుంచి 21వ తేదీ వరకు శ్రీలంక దేశంలోని దియగమ మహేంద్ర రాజపక్సే స్టేడియంలో జరిగిన మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో సన్యాసినాయుడు ప్రతిభ చూపారు. ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని పోలీస్ సిబ్బందికి ఎస్పీ సూచించారు. కార్యక్రమంలో ఆర్మ్‌డ్ రిజర్వు డీఎస్పీ యూనివర్స్, ఆర్‌ఐలు రమణమూర్తి, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

కేరింత..!



స్వామి వివేకానంద, మహాకవి గురజాడ చిత్రపటాల వద్ద అంజలి ఘటిస్తున్న అతిథులు





యువజనోత్సవాల్లో యువత ప్రదర్శనలు

- ఉల్లాసంగా జిల్లా యువజనోత్సవం
- భాగస్వామ్యమైన యువత, అధికారులు, ప్రముఖులు
- 15 అంశాల్లో పోటీలకు హాజరైన 500 మంది యువత

విజయనగరం: ఈ ఏడాది(2023-24) విజయనగరం జిల్లా యువజనోత్సవాలు ఉల్లాసంగా..ఉత్సాహంగా జరిగాయి. స్థానిక సీతం కళాశాల వేదికగా ఆహ్లాదకర వాతావరణంలో ఉత్సవాలు గురువారం నిర్వహించారు. సెట్విజ్, నెహ్రూ యువ కేంద్ర, సీతం కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన యువజనోత్సవాల్లో సెట్విజ్ సీఈవో బి.రామగోపాల్, జిల్లా యువజన అధికారి వెంకట్ ఉజ్వల్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఈశ్వర్ కౌశిక్, సీతం కళాశాల డైరెక్టర్ ఎం. శశిభూషణ రావు, ప్రిన్సిపాల్ రమణ మూర్తి, బ్రహ్మ కుమారి అన్నపూర్ణ, మెప్మా పీడీ సుధాకర్, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి గోవిందరావు, అడల్ట్ ఎడ్యుకేషన్ డీడీ సోమేశ్వరరావు, సంగీత కళాశాల అధ్యాపకురాలు బిందు తదితరులు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం స్వామి వివేకానంద, గురజాడ చిత్రపటాలకు పూలమాలలు వేసి యువజనోత్సవాలను ప్రారంభించారు. జిల్లాలోని వివిధ కళాశాలల నుంచి సుమారు 500 మంది విద్యార్థులు హాజరై వివిధ పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సాంస్కృతిక కళా వైభవం, జీవిత నైపుణ్యం, శారీరక, మానసిక ఆరోగ్యం ప్రాధాన్యాన్ని తెలియజేస్తూ వివిధ ప్రదర్శనలు నిర్వహించారు. సెట్విజ్ శాఖ ఆధ్వర్యంలో సుమారు 15 అంశాల్లో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించగా యువత ఉత్సాహంగా పాల్గొన్నారు.


జిల్లా స్థాయి యువజనోత్సవాలకు హాజరైన యువత

లక్ష్య సాధన కోసం తపించాలి

ఈ సందర్భంగా కార్యక్రమానికి విచ్చేసిన అతిథులంతా యువతను ఉద్దేశించి మాట్లాడుతూ బలమైన లక్ష్యం ఏర్పాటు చేసుకుని సాధన కోసం నిరంతరం తపించాలని, శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఆశయ సాధన కోసం అకుంఠిత దీక్ష, ఏకాగ్రత చాలా అవసరమని పేర్కొన్నారు. పోటీతత్వం అలవర్చుకోవాలని, మానసిక ధైర్యంతో ముందుకు వెళ్లాలని హితవు పలికారు. ఆర్థిక, రాజకీయ, సామాజిక చైతన్యం పొందడానికి అవసరమైన జ్ఞానాన్ని సంపాదించుకోవాలని, క్రమ శిక్షణతో కూడిన జీవితాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. మంచి పనుల కోసం యువత తమ శక్తిని, జ్ఞానాన్ని ఉపయోగించాలని, చెడుకు దూరంగా ఉండాలని హితవు పలికారు.

ఆకట్టుకున్న ఆహార పదార్థాల ప్రదర్శన

జిల్లా యువజనోత్సవ కార్యక్రమంలో స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో వివిధ రకాల ఆహార పదార్థాలను ప్రదర్శనలో ఉంచగా అందరినీ ఆకట్టుకున్నాయి. అలాగే విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. సీతం కళాశాల అధ్యాపకులు, సెట్విజ్, యువజన సర్వీసుల శాఖ అధికారులు, సిబ్బంది, అధిక సంఖ్యలో విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

కొనసాగుతున్న పాలీ్ట్ర కార్మికుల దీక్ష

- రెండు వారాలుగా నిరసన
- పట్టించుకోని యాజమాన్యం


పాలీ్ట్రస్ పరిశ్రమ ఎదుట నిరాహార దీక్ష చేస్తున్న కార్మికులు

చీపురుపల్లి: రేయింబవళ్లు పనిచేస్తున్నారు. యాజమాన్యం చెప్పిన ప్రతి పనీ చేస్తున్నారు. విధి నిర్వహణే పరమావధిగా పనులు నిర్వహిస్తున్నారు. కష్టానికి తగ్గట్టుగా వేతనాలు పెంచండి మహాప్రభో అంటూ కార్మికులు కోరుతుంటే యాజమాన్యం ససేమిరా అంటోంది. ఇదీ మండలంలోని కర్లాం పరిసరాల్లో గల శ్రీ వెంకటరామా పాలీ్ట్రస్ పరిశ్రమలో కార్మికుల పరిస్థితి. ఆ పరిశ్రమ కార్మికులు తమకు పనికి తగ్గ వేతనాలు పెంచాలని కోరుతూ రెండు వారాలుగా పరిశ్రమ ఎదుట రిలే నిరాహార దీక్ష చేస్తున్నారు. విధులు బహిష్కరించి నిరాహార దీక్ష చేస్తున్నప్పటికీ పరిశ్రమ యాజమాన్యం స్పందించడం లేదని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శ్రీ వెంకటరామా పాలీ్ట్రస్ పరిశ్రమలో ఈ ప్రాంతానికి చెందిన 170 మంది విధులు నిర్వహిస్తున్నారు. స్థానికేతరులైన ఒడిశా ప్రాంతానికి చెందిన కార్మికులు చాలామంది పరిశ్రమలో ఉన్నారు.

సాంఘిక పరివర్తనకు రచనలతో ప్రయత్నం


పుస్తకావిష్కరణలో అరసం జాతీయ ప్రధాన కార్యదర్శి పెనుగొండ లక్ష్మీ నారాయణ, తదితరులు

విజయనగరం అర్బన్: తన రచనల ద్వారా సాంఘిక పరివర్తనకు ప్రయత్నించిన మహాకవి గురజాడ అని అభ్యుదయ రచయితల సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పెనుగొండ లక్ష్మీ నారాయణ అన్నారు. ఈ మేరకు స్థానిక గురజాడ పాఠశాలలో గురువారం జరిగిన గురజాడ జయంతి ఉత్సవాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురజాడ చాలా రచనలు చేసినప్పటికీ సమాజంలో మార్పు కోరుతూ రాసిన కన్యాశుల్కం నాటకం పేరుగాంచిందన్నారు. నేటి విద్యార్థులు గురజాడ అప్పారావును ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన కవితాస్రవంతి పుస్తకాన్ని ఆవిష్కరించారు. డాక్టర్ ఎంవీకృష్ణాజీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాద్, కార్యదర్శి శరత్ చంద్రజ్యోతి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జీఎస్‌చలం, ఆర్.బాలకృష్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పూడిశేఖర్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని ఆటో డ్రైవర్ మృతి


ఘటనాస్థలంలో కొండలరావు మృతదేహం

రాజాం సిటీ: మండల పరిధి మొగిలివలస జంక్షన్ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అంతకాపల్లి గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ నేదూరు కొండలరావు (36) మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గురువారం వేకువజామున పొందూరులో కూరగాయల లోడు వేసుకుని రాజాం మార్కెట్‌లో కొండలరావు దించాడు. అనంతరం స్వగ్రామం తిరిగి వెళ్తుండగా శ్రీకాకుళం నుంచి వస్తున్న లారీ ఆటోను బలంగా ఢీకొంది. దీంతో ఆటో ముందు అద్దం పగిలిపోయి డ్రైవర్ రోడ్డుపై పడిపోగా బలమైనగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాద విషయం తెలుసుకున్న సీఐ కె.రవికుమార్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు ఆరా తీశారు. మృతుని భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వీబీ రామకృష్ణ తెలిపారు. మృతునికి భార్యతో పాటు ఇద్దరు చిన్నారులు ఉన్నారు.

చదువుకు చక్కని ప్రాధాన్యం

- ఏకలవ్య పాఠశాలను సందర్శించిన జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు


గుమ్మలక్ష్మీపురం ఏకలవ్య పాఠశాల విద్యార్థులతో ముచ్చటిస్తున్న జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు అనంతనాయక్

గుమ్మలక్ష్మీపురం: రాష్ట్ర ప్రభుత్వం చదువుకు చక్కని ప్రాధాన్యమిస్తోందని, అవకాశాలను అందిపుచ్చుకుని ఉన్నతంగా రాణించాలని జాతీయ ఎస్టీకమిషన్ సభ్యుడు అనంతనాయక్ సూచించారు. గుమ్మలక్ష్మీపురం మండలంలోని ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలను ఆయన గురువారం సందర్శించారు. విద్యార్థులతో ముచ్చటించారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను తెలుసుకుని సంతోషం వ్యక్తంచేశారు. చక్కని మెనూ, నాడు-నేడుతో సర్కారు బడులకు ఆధునిక సదుపాయాల కల్పన, వివిధ పథకాలతో విద్యార్థులకు ఆర్థిక తోడ్పాటునందించడం బాగుందన్నారు. విద్యావకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. ముందుకు ఏకలవ్య పాఠశాలలో గిరిజన సంక్షేమ శాఖ ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్‌ను సందర్శించారు. కొండ ప్రాంతాల్లో ఏర్పాటుచేస్తున్న 4జి సెల్ టవర్స్‌ను సూచిస్తూ ఏర్పాటుచేసిన స్టాల్‌ను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఆయన వెంట పార్వతీపురం ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్, డీడీ కె.శ్రీనివాసరావు, వైకేపీ ఏపీడీ సత్యనారాయణ, ఎంఈఓలు చంద్రశేఖర్, జనార్దనరావు, ఏటీడబ్ల్యూఓ సురేష్‌కుమార్, ఎంపీడీఓ సాల్మన్‌రాజ్, తహసీల్దార్ జె.రాములమ్మ, తదితరులు ఉన్నారు. అనంతరం ఆయన భద్రగిరి సీహెచ్‌సీని సందర్శించారు. ఆస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు.

గడ్డిమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

బొబ్బిలి: మండలంలోని మెట్టవలస గ్రామానికి చెందిన ఉంగట్ల రామకృష్ణ గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బైక్ కొనే విషయమై భార్యతో గొడవ పడి మనస్తాపం చెంది గడ్డిమందు తాగేశాడు. కుటుంబసభ్యులు గమనించి విశాఖ కేజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చదలవాడ సత్యనారాయణ తెలిపారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం


మిశ్రమ పంటలను పరిశీలిస్తున్న ఆర్‌వైఎస్ఎస్ అధికారులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

బొబ్బిలి: ప్రకృతి వ్యవసాయంలో మిశ్రమ పంటలు సాగుచేయడం వల్ల అధిక దిగుబడులు, లాభాలు వస్తాయని ప్రకృతి వ్యవసాయం ఆర్‌వైఎస్ఎస్ అధికారులు రాధామాధవ్, రాజేష్ తెలిపారు. మండలంలోని మెట్టవలస పొలాల్లో పత్తిలో సజ్జలు, జొన్న, కంది, ఆముదం, కూరగాయల పంటల సాగును చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. మిశ్రమ పంటలను ప్రోత్సహించాలని ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డీపీఎం ఆనందరావు, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది వాంఢ్రాసి లక్ష్మి, శంకరరావు పాల్గొన్నారు.

ఆపన్న హస్తం


చెక్కును అందజేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: మానసిక దివ్యాంగురాలి వైద్యం కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి లక్ష రూపాయల సాయం అందింది. పూసపాటిరేగ మండలం చోడమ్మ అగ్రహారం గ్రామానికి చెందిన గుడివాడ సత్యవతి తమ కుమార్తెకు మానసిక వైద్యం కోసం ఆర్థిక సహాయం అందించాలని ఇటీవల మరడాం పర్యటనలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన సీఎం రూ.లక్ష ఆర్థిక సాయం ప్రకటించి మంజూరు చేశారు.

ఆస్పత్రి వ్యర్థాల నిర్వహణ
అత్యంత కీలకం


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

- ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలి
- కలెక్టర్ నాగలక్ష్మి

సాక్షి ప్రతినిధి విజయనగరం: ఆస్పత్రి వ్యర్థాల నిర్వహణ అత్యంత కీలక ప్రక్రియ అని, ప్రజారోగ్యానికి భంగం కలగకుండా వీటిని జాగ్రత్తగా తరలించాలని కలెక్టర్ నాగలక్ష్మి సూచించారు. జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం జిల్లా పర్యవేక్షక కమిటీ సమీక్ష సమావేశం జరిగింది. ఆస్పత్రి వ్యర్థాల నిర్వహణకు జిల్లాలో తీసుకున్న చర్యలను పొల్యూషన్ ఇంజినీర్ బి.బి.సరిత వివరించారు. ప్రతి ఆస్పత్రిలో నిర్దేశిత రంగంలో ప్రత్యేక చెత్త బుట్టలను ఏర్పాటు చేసి, వ్యర్థాలను వాటిల్లోనే వేయాల్సి ఉంటుందన్నారు. అనుమతి పొందిన సంస్థ ద్వారా 48 గంటల్లో చెత్తను భద్రంగా తరలించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ ప్రైవేట్ ఆస్పత్రులతో పాటు, ప్రభుత్వాస్పత్రులు కూడా వ్యర్థాల నిర్వహణపై దృష్టి పెట్టాలని సూచించారు. ఆస్పత్రి వ్యర్థాలు బయటి వ్యర్థాలతో కలిపి ఎక్కడికక్కడ పడేస్తే వివిధ రకాల వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందన్నారు. వ్యర్థాల తరలింపులో ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా పాటించేలా ఆస్పత్రి సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని సూచించారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, మున్సిపాలిటీ, వైద్య ఆరోగ్య శాఖలు సంయుక్తంగా శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలని చెప్పారు. శిక్షణ ఇచ్చిన తరువాత ఆస్పత్రులను తనిఖీచేసి, నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ వెంకట త్రివినాగ్, మున్సిపల్ కమిషనర్లు, వైద్య ఆరోగ్య శాఖాధికారులు, వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమగ్రాభివృద్ధే లక్ష్యం

- ఆర్‌జేడీ ఎం.జ్యోతికుమారి

గంట్యాడ/బొండపల్లి: విద్యార్థుల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా ప్రతి ఉపాధ్యాయుడు బోధన సాగించాలని, ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను అందిపుచ్చుకోవాలని ఆర్‌జేడీ ఎం.జ్యోతికుమారి సూచించారు. గంట్యాడ ఎంఈఓ కార్యాలయం, బొండపల్లి మండలం గొట్లాం జిల్లాపరిషత్ హైస్కూల్‌లో ఆయా మండలాల ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో గురువారం నిర్వహించిన సమావేశాల్లో ఆమె మాట్లాడారు. నోట్ బుక్స్, వర్క్ బుక్స్ కరెక్షన్స్‌ను ప్రతి ఉపాధ్యాయుడు పూర్తి చేయాలన్నారు. మనబడి నాడు-నేడు కింద పాఠశాలలకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యాప్రణాళికను పక్కాగా అమలుచేయాలన్నారు. ప్రతి విద్యార్థి అభ్యసనా సామర్థ్యాలను అంచనా వేయాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. టోఫెల్ పరీక్షలు విధిగా నిర్వహించాలని సూచించారు. 100 శాతం జీఈఆర్ సర్వేను వెల్ఫేర్ అసిస్టెంట్, వలంటీర్ల సహాయంతో పూర్తి చేయాలని సూచించారు. పదోతరగతి ఫెయిలైన విద్యార్థులను పాఠశాలలో చేర్పించుకోవాలన్నారు. బైజూస్ ట్యాబ్‌లలో ఎలాంటి సాంకేతిక సమస్యలు వచ్చినా సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలన్నారు. సమావేశంలో డీసీఈబీ కార్యదర్శి టి.సన్యాసిరాజు, మండల విద్యాశాఖ అధికారులు విజయకుమారి, వెంకటరావు, శోభారాణి, అల్లు వెంకటరమణ, హెచ్ఎం ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లతో పాటు మరుగుదొడ్ల నిర్మాణం

- గృహనిర్మాణశాఖ పీడీ డి. శ్రీనివాసరావు
- మెరకముడిదాంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష


గృహనిర్మాణాలపై సమీక్ష నిర్వహిస్తున్న పీడీ శ్రీనివాస్

మెరకముడిదాం: ఇళ్ల నిర్మాణంతో పాటు మరుగుదొడ్లను కూడా కచ్చితంగా నిర్మించాలని గృహనిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.శ్రీనివాస్ సూచించారు. ఈ మేరకు గురువారం ఆయన గృహనిర్మాణాలపై మెరకముడిదాం మండల ఏఈ, సిబ్బందితో పాటు సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. ఇందులో భాగంగా ముందుగా మండలంలో ఇంతవరకూ మంజూరైన ఇళ్లు ఎన్ని? నిర్మాణాలు పూర్తయినవి ఎన్ని? పూర్తి కావాల్సినవి ఎన్ని? అని ప్రశ్నించారు. దీనికి ఏఈ సమాధానమిస్తూ మండలానికి సంబంధించి 1972 ఇళ్లు మంజూరు కాగా అందులో 1462 నిర్మాణం పూర్తయిందని, ఇంకా 171 ఇళ్ల నిర్మాణం పునాదుల లెవెల్‌వరకూ జరిగిందని, శ్లాబ్ లెవెల్ వరకూ 119 కాగా శ్లాబ్ పూర్తయినవి 87 ఉన్నాయని, నిర్మాణం ప్రారంభం ఇళ్లు 133 ఉన్నాయని తెలిపారు. అలాగే 23 జగనన్న లేఅవుట్లలో 669 ఇళ్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ఇళ్ల నిర్మాణం చేపట్టిన లబ్ధిదారులు మరుగుదొడ్లు నిర్మిస్తున్నారా? అని ఏఈని పీడీ ప్రశ్నించగా లబ్ధిదారులు మరుగుదొడ్లు నిర్మిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో గృహనిర్మాణశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ డి.శ్రీనివాసన్, డిప్యూటీ ఇంజినీర్ జి.మురళీమోహన్, ఎంపీడీఓ ఎం.రత్నం, ఉపాధి ఏపీఓ ఎస్.పెదప్పలనాయుడు, మండలానికి చెందిన ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.